క్లుప్తంగా

చవితి ఉత్సవాలకు శ్రీకారం



అంబాజీపేటలో చవితి పందిరిరాట ముహూర్తం చేస్తున్న నిర్వాహకులు

అంబాజీపేట: భక్తుల నుంచి తొలి పూజలు అందుకునేందుకు వచ్చే నెల 7న ప్రారంభమయ్యే వినాయక చవితి ఉత్సవాలకు బుధవారం శ్రీకారం చుట్టారు. అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంకటేశ్వర స్వామి వారి ఆలయ సమీపాన బాల గణపతి నిర్వాహకుల ఆధ్వర్యంలో పందిరి రాట ముహూర్తం చేశారు. తొలుత గణపయ్యకు ప్రత్యేక పూజలు చేసి చవితి ఉత్సవాలకు సంబంధించి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో అరిగెల శివ కల్యాన్, కొర్లపాటి బాబి, పళ్ల రాజు, పళ్ల భాను, సత్య కుమార్, వీరా వీరబాబు, వంగా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: గ్రామాల్లో గణపతి నవరాత్ర మహోత్సవాలకు పందిరి రాట వేశారు. వచ్చే నెల 7న వినాయకచవితి సందర్భంగా గ్రామ గ్రామాన వినాయకస్వామి ఆలయాల వద్ద మాత్రమే కాకుండా గ్రామంలోని పలు వీధుల్లో గణపతిని ప్రతిష్ఠించి నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆ మేరకు ఇప్పటికే పలు చోట్ల పందిర్లు వేస్తుండగా బుధవారం మంచి ముహూర్తాన పలు చోట్ల పందిరి రాట పాతి ఏర్పాట్లు ప్రారంభించారు.

నాణ్యతా ప్రమాణాలతో నిర్మించాలి

అంబాజీపేట: నాడు–నేడు పనులను ప్రభుత్వ నిబంధనల మేరకు నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వర రావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న నాడు–నేడు పనులను బుధవారం ఎంపీపీ పరిశీలించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ త్వరితగతిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. స్థానిక ప్రాంగణంలో నిర్మిస్తున్న డైనింగ్ హాల్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంపీపీతో పాటు ఎంఈఓ–2 మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ధర్నా

మామిడికుదురు: ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మాలల న్యాయ పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం మామిడికుదురులో ధర్నా చేశారు. మండల రెవెన్యూ కార్యాలయం వద్ద మాలల న్యాయ పోరాట సమితి మండల జేఏసీ ఆధ్వర్యంలో వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రాణాలైనా అర్పిస్తాం, వర్గీకరణను అడ్డుకుంటాం అంటూ నినదించారు. రాజ్యాంగ వ్యతిరేకమైన ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పునః సమీక్షించాలని డిమాండ్ చేశారు. వర్గీకరణను అడ్డుకుంటామంటూ నినాదాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సున్నితమైన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం మండల రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి

మామిడికుదురు: సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. మొగలికుదురులో జనసేన ఆధ్వర్యంలో రూ.2.25 లక్షలతో స్వచ్ఛందంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబుతో కలసి అక్కడ ఏర్పాటు చేసిన టీడీపీ, జనసేన పతాకాలను ఆవిష్కరించారు. ఇదే స్ఫూర్తితో మరింత ముందుకు వెళ్లాలని ఎమ్మెల్యే పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని ఎమ్మెల్యే సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన మండల శాఖ నాయకులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం: ఊడిమూడి రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల వంతున కూటమి ప్రభుత్వం సాయం అందించిందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ఊడిమూడి శివారు చింతావారిపేట వద్ద గత మే నెల 14వ తేదీ రాత్రి ధాన్యం ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఐదుగురు వ్యవసాయ జట్టు కూలీలు మృతి చెందిన విషయం విదితమే. ఈ ప్రమాదంలో జి.పెదపూడికి చెందిన నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యనారాయణ, ఈరి కట్లయ్య, ఆదిమూలం వారి పాలేనికి చెందిన చిలకలపూడి మణిబాబు, చిలకలపూడి సురేష్‌లు మృతి చెందారు. ఈ ఐదుగురు కుటుంబాలకు రూ.10 లక్షల వంతున ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తం రూ.50 లక్షల చెక్కులను బుధవారం పి.గన్నవరంలోని పార్టీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే అందజేశారు. పార్టీ నాయకుడు వాసంశెట్టి కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆర్టీఓ జీవీవీ సత్యనారాయణ, జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, శిరిగినీడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మహిళలకు భరోసా కల్పించాలి

ఆధునిక యుగంలో అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని ప్రభుత్వాలు ఎంతో ప్రచారం చేస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో కూడా ఆ దిశగా చర్యలు చేపట్టాలి. నేరాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు భరోసా కల్పించాలి. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి.

– కేఎస్ శ్రీనివాస్, వైద్యుడు, పీహెచ్‌సీ, అంబాజీపేట



సామాజిక చైతన్యంతోనే రక్షణ

ఆపదలో ఉన్న రోగుల ప్రాణాలు కాపాడి వారి ముఖాల్లో ఆనందం చూడాలన్నదే ప్రతి వైద్యుడి కోరిక. ప్రత్యక్ష దైవాలుగా భావించే వైద్యులు, సిబ్బందికే రక్షణ కరువైతే ఎలా? మహిళా వైద్యులు, సిబ్బంది భద్రతకు కఠిన చట్టాలు అమలు చేయాలి. వైద్య సిబ్బందిపై దాడులకు పాల్పడితే విధించే శిక్షల వివరాలతో కూడిన బోర్డులను ప్రతి ఆస్పత్రిలో ఏర్పాటు చేయాలి.



– చెల్లుబోయిన వెంకటేష్, చిన్న పిల్లల వైద్యుడు, సాయికృష్ణ హాస్పిటల్, అంబాజీపేట

క్రీడల్లో విశేషంగా రాణిస్తున్న విద్యార్థులు



క్రీడల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులు (ఫైల్)

నేడు పురస్కారాల ప్రదానం

మామిడికుదురు: విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చిన స్కూళ్లకు జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా ప్రతిభా పురస్కారాలు వరించాయి. కోనసీమ జిల్లాలో అయిదు స్కూళ్ల ఈ అవార్డులను దక్కించుకోగా అయిదు అవార్డులు రాజోలు, కొత్తపేట నియోజకవర్గాలకు చెందిన పాఠశాలలకు దక్కడం విశేషం. కొత్తపేట నియోజకవర్గంలోని ఆత్రేయపురం మండలం లొల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రథమ స్థానం, రాజోలు నియోజకవర్గంలోని మలికిపురం మండలం గుడిమెళ్లంక జెడ్పీ హెచ్ స్కూల్‌కు రెండో స్థానం, రాజోలు మండలం చింతలపల్లి జెడ్పీహెచ్ స్కూల్‌కు మూడో స్థానం, మలికిపురం మండలం బట్టేలంక స్కూల్‌కు నాలుగో స్థానం, రాజోలు మండలం పొన్నమండ జెడ్పీహెచ్ స్కూల్‌కు ఐదో స్థానం లభించాయి. ఈ నెల 29వ తేదీ గురువారం అమలాపురంలో జరిగే సమావేశంలో కలెక్టర్, డీఈఓ ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో హెచ్ఎంలతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానించి జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందించనున్నారు. ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన పాఠశాలల హెచ్ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయుల మనోగతం ఇదీ...

విద్యార్థులు పడ్డ కష్టానికి ఫలితం ఇది



ఈ ఏడాది జాతీయ స్థాయి పోటీలకు మా స్కూల్ విద్యార్థులు ఏడుగురు అర్హత సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వివిధ క్రీడల్లో మా స్కూల్ విద్యార్థులు రాణించడం వల్ల మాకు క్రీడా ప్రతిభా పురస్కారం లభించింది. పీడీ వై.శ్రీనివాసరావు విద్యార్థులను క్రీడల్లో తీర్చిదిద్దారు. గత ఏడాది మా స్కూల్‌కు అయిదో స్థానం లభించింది. ఈ ఏడాది మొదటి స్థానం సాధించడం చాలా ఆనందంగా ఉంది. మా విద్యార్థులు పడ్డ కష్టానికి ఫలితం లభించింది.

– జి.జ్ఞానేశ్వరి, హెచ్ఎం, లొల్ల జెడ్పీహెచ్ స్కూల్

రాష్ట్ర స్థాయి పోటీలకు 31 మంది అర్హత



మా స్కూల్ విద్యార్థులు ఈ ఏడాది జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో 31 మంది పాల్గొన్నారు. వారిలో ఒక విద్యార్థి వెండి పతకం, ఆరుగురు విద్యార్థులు కాంస్య పతకాలు సాధించారు. మా స్కూల్ పీడీ చొప్పల్ల చంద్రశేఖర్ విద్యార్థులను క్రీడల్లో మెరికల్లా తీర్చిదిద్దారు. గత ఏడాది క్రీడా ప్రతిభా పురస్కారాల్లో మా స్కూల్‌కు మొదటి స్థానం లభించింది. ఈ ఏడాది కూడా క్రీడా ప్రతిభా అవార్డు రావడం గర్వంగా ఉంది. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లోను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం.

– డి.జానకిరామయ్య, హెచ్ఎం, చింతలపల్లి జెడ్పీహెచ్ స్కూల్

ఏడు బంగారు పతకాలు సాధించాం



మా స్కూల్ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోను ఎంతో ప్రతిభ చూపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు 15 అర్హత సాధించారు. వారిలో ఏడుగురు బంగారు పతకాలు గెలుపొందారు. అయిదు కాంస్య పతకాలు సాధించారు. ముగ్గురు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు ప్రోత్సాహంతో విద్యార్థులు క్రీడల్లో విశేషంగా రాణిస్తున్నారు. వారికి అవసరమైన శిక్షణ ఇస్తూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. మా స్కూల్‌కి అవార్డు రావడం సంతోషంగా ఉంది.

– కె.నాగరాజు, పీడీ, బట్టేలంక జెడ్పీహెచ్ స్కూల్

ఆస్పత్రి అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తాం



అలమూరులోని ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించిన ఇటుక బట్టీ అసోసియేషన్, అఖిల పక్ష ప్రతినిధులు

ఆలమూరు: స్థానిక సామాజిక ఆస్పత్రి (సీహెచ్ సీ) అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తానని ఇటుక బట్టీ మండల అసోసియేషన్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర రావు, వ్యాపారవేత్త ఈదల సత్తిబాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఈదల నల్లబాబు వెల్లడించారు. ఈ నెల 22న 'సాక్షి' దినపత్రికలో వైద్యులపై దౌర్జన్య కాండ అని శీర్షిక ప్రచురితమైంది. దీనిపై వివిధ పార్టీలకు చెందిన నేతలు ఆస్పత్రిని సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అందులో భాగంగా ఇటుక బట్టీ అసోసియన్ సహకారంతో తక్షణ అవసరమైన ఎనిమిది సీసీ కెమెరాలు, నాలుగు సీలింగ్ ఫ్యాన్లను రూ.70 వేలతో అఖిల పక్ష నేతలు సమకూర్చారు. సీసీ కెమెరాలను ఇటుక బట్టీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రారంభించారు. సీలింగ్ ఫ్యాన్లను ఆస్పత్రి చీఫ్ సూపరింటెండెంట్ పి.గోపిరామ్‌కు బుధవారం అందజేశారు. ఆస్పత్రికి ఏ సమస్య వచ్చిన సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆకతాయిల బెడదపై ఎస్సై ఎం.అశోక్ రోజూ పెట్రోలింగ్ నిర్వహిస్తారన్నారు. సొసైటీ మాజీ చైర్మన్ వంటిపల్లి సతీష్, శిరిగినీడి పట్టాభి, రామానుజుల శేషగిరిరావు, చల్లా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



గుమ్మిలేరులో వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అన్నవరం దంపతులు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న మహా సంప్రోక్షణ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఆలయ ముఖ మండపంలో వేంకటేశ్వరస్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. నాలుగు దశాబ్దాల క్రితం రెడ్డి వెంకట్రావు ఆధ్వర్యంలో నిర్మించిన ఈ ఆలయం ఇటీవల పునర్నిర్మాణంలో భాగంగా రూ.40 లక్షలతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గ్రామానికి చెందిన వంక వీవీ సత్యనారాయణ మూర్తి (అన్నవరం), తులసీ గంగాభవానీ దంపతుల చేతుల మీదుగా వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం జరిగింది. పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు పది వేల మందికి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. సర్పంచ్ గుణ్ణం రాంబాబు, రెడ్డి సత్తిబాబు, ముత్యాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష పరిరక్షణకు కృషి చేయాలి



కత్తిమండ ప్రతాప్

సఖినేటిపల్లి: తెలుగు భాష పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ కవి, శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. బుధవారం సఖినేటిపల్లిలో ఆయన తెలుగు భాషా దినోత్సవం (29వ తేదీ)పురస్కరించుకుని మీడియాతో మాట్లాడారు. పాలన, బోధన, జన జీవన రంగాల్లో తెలుగు అమలుపర్చాలని కోరారు. తెలుగులోనే ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగులోనే అమలు చేసి, సామాన్యులకు అర్థమయ్యే రీతిలో ఉండాలని ఆయన తెలిపారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో, కార్యాలయాల్లో కూడా తెలుగులోనే మాట్లాడాలనే నిబంధనలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. తెలుగు ఔన్నత్యాన్ని పాఠ్యగ్రంథాలలో ప్రవేశ పెట్టాలని, విద్యార్థి దశ నుంచి మాతృభాషపై మమకారం పెంచే విధంగా అధికారులు చూడాలన్నారు. ఆధునిక పోకడల పేరుతో మాతృభాష–స్వరూప స్వభావాలను, రూపురేఖలను మార్చేస్తున్నారన్నారు. కాగా ప్రచార మాధ్యమాలు భాషని ఎక్కువగా ప్రభావితం చేస్తాయని, అక్కడ నుంచే మార్పు తీసుకురావడంపైనే పరిగణించాలన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



వానపల్లిలో వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరుపుతున్న పండితులు, భక్తులు

కొత్తపేట: మండలంలోని వానపల్లిలో నూతనంగా నిర్మించిన శ్రీ, భూ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహాల ప్రతిష్ఠాపనను బుధవారం వైభవంగా నిర్వహించారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆ గ్రామానికి చెందిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నేమాని భాస్కర రామం, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి కృషి మేరకు టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ నిధులు రూ 1.5 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. భాస్కరరామం, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం పూర్తికాగా తిరుపతిలో ప్రముఖ శిల్పులతో తయారుచేయించిన దేవతామూర్తుల విగ్రహాలను తీసుకువచ్చి సోమవారం నుంచి నేమాని భాస్కరరామం పర్యవేక్షణలో ఆగమ శాస్త్ర పండితులు మూడు రోజుల పాటు గ్రామానికి చెందిన భక్త దంపతులు నేమాని లక్ష్మీనారాయణ, నేమాని జగన్నాథం, అన్నందేవుల మాధవరావు, బండారు పళ్లంరాజు, విస్సాప్రగడ వెంకటసుబ్బారావు తదితర భక్త దంపతులు విశేష పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం 5 గంటల నుంచి వివిధ పూజా, హోమ కార్యక్రమాల అనంతరం 8.11 గంటలకు నమో వేంకటేశాయనమః నామస్మరణతో అన్ని ప్రతిష్ఠలను వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, గ్రామ ఆడపడుచులు ఆలయం, రాజగోపురం శిఖరాలపై బూరెలు పోశారు. అనంతరం ప్రసాద వితరణ, భారీ ఎత్తున అన్నసమారాధన జరిపారు. కార్యక్రమంలో వానపల్లితో పాటు కోనసీమ వ్యాప్తంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రతి సోమవారం అన్నదానం

కొత్తపేట: మండలంలో పురాణ ప్రసిద్ధి చెందిన పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రతి సోమవారం అన్నదానం చేయనున్నారు. ఆ మేరకు కొప్పేశ్వరస్వామి ఆలయ అన్నదాన కమిటీ ఏర్పడింది. కమిటీ సభ్యుడు, రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఈ అన్నదానానికి శ్రీకారం చుట్టారు. సుమారు 50 ఏళ్ల క్రితం కోనసీమలో ప్రసిద్ధి చెందిన అప్పనపల్లి బాలబాలాజీ ఆలయంలో తొలుతగా అన్నదానానికి శ్రీకారం చుట్టారు. ఆ ఆలయాన్ని స్ఫూర్తిగా తీసుకుని అయినవిల్లి, వాడపల్లి ఆలయాల్లో నిత్యాన్నదానం నిర్వహిస్తుండగా, మందపల్లి శనైశ్చర స్వామి ఆలయంలో ప్రతి శనివారం ఆ దేవస్థానం వారు అన్నదానం నిర్వహిస్తున్నారు. అలాగే అగస్త్యేశ్వర మహర్షి శివపార్వతులను ఏకపీఠంపై ప్రతిష్ఠించిన క్షేత్రంగా, కొప్పు ధరించిన కొప్పేశ్వర స్వామి ఆలయంగా ప్రసిద్ధి చెందిన పలివెల ఉమా కొప్పేశ్వర స్వామి వారి ఆలయానికి ప్రతి సోమవారం స్థానిక, స్థానికేతర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తారు. ఆ గ్రామంలో మధ్యాహ్న సమయంలో అల్పాహారం, భోజన సౌకర్యం లేక స్థానికేతర ప్రాంతాల భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఆ భక్తుల సౌకర్యార్థం స్వామి భక్తుడు, వివిధ పర్వదినాల్లో తమ సహచరులు, కుటుంబ సభ్యులు, వలంటరీ భక్తులతో కలసి భక్తులకు సేవలందిస్తున్న తోట వెంకటేశ్వరరావు ప్రతి సోమవారం ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదం వితరణ చేయాలని తలచారు. అందుకు పలువురు భక్తులు, దాతలు ఆయనతో చేతులు కలిపారు. ఆ మేరకు గురువారం ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించనున్నారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి



పుల్లేటికుర్రులో మాట్లాడుతున్న సాయిరామ్

అంబాజీపేట: ప్రతి ఒక్కరూ హిందూ ధర్మాన్ని పరిరక్షించడంతో పాటు భక్తి భావాన్ని పెంచాలని విశ్వహిందూ పరిషత్ ప్రాంత అధికారి సాయిరామ్ అన్నారు. పుల్లేటికుర్రులో వాసవీ కాన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో విశ్వహిందూ పరిషత్ 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా దివస్‌ను మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ చేపట్టిన అక్షితాన్ అయోధ్య, అక్షితాన్ అభియాన్, రథయాత్ర, సామూహిక వరలక్ష్మి వ్రతాలను జిల్లాలో నిర్వహించామన్నారు. సమావేశంలో కార్యదర్శి ప్రయోగ నరసింహమూర్తి, భమిడిపాటి కృష్ణమూర్తి, కడలి వెంకటేశ్వరరావు, అయ్యగారి వెంకట్రావు, వాడ్రేవు శ్రీరామచంద్రమూర్తి, కాండ్రేగుల వెంకటరమణ, మేడేపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ జ్వరాలపై అశ్రద్ధ వద్దు



రావులపాలెం మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి

రావులపాలెం: ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పుల కారణంగా సీజనల్ జ్వరాలు వస్తున్నాయని వీటిపై వైద్య సిబ్బంది అశ్రద్ధ వహించకుండా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ ఉండాలని ఎంపీపీ కర్రి లక్ష్మీ వెంకట నాగదేవి వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ లక్ష్మీ వెంకట నాగదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో తొలుత వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను సభలో చదివి వినిపించారు. ఎంపీపీ మాట్లాడుతూ కొన్ని సమస్యలు గత రెండు మూడు సమావేశాలుగా పరిష్కారం కాకుండా మళ్లీ సభ దృష్టికి వస్తున్నాయని, వీటిపై ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ప్రస్తుత సీజన్‌లో వస్తున్న జ్వరాలపై వైద్యశాఖ అధికారులను ఆరా తీశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వీవీ సాయిబాబు, తహసీల్దార్ బీఎం ముక్తేశ్వరరావు, ఏవో రాజేంద్రప్రసాద్, వైస్ ఎంపీపీలు బొక్కా ప్రసాద్, గన్నవరపు వెంకట్రావు, సర్పంచులు పాల్గొన్నారు.

చింతనలంకలో విష జ్వరాలు

అయినవిల్లి: మండలంలోని చింతనలంక, వెలువలపల్లి గ్రామాల్లో విష జ్వరాలు ఎక్కువగా ఉండటంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. దీంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు నేరుగా పరిస్థితులు తెలుసుకునేందుకు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్ బుధవారం వైద్యశాఖ, పంచాయతీరాజ్ శాఖ అధికారులతో కలసి పర్యటించారు. ఎమ్మెల్యే, ఎంపీ, డీఎం అండ్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు గ్రామంలో అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యురాలు బి.మంగాదేవి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

మల్టీస్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి

మలికిపురం: మండలంలోని లక్కవరం పీహెచ్‌సీ ఆవరణలో పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం విధానంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు కృషి చేస్తున్నట్టు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం లక్కవరంలోని పీహెచ్‌సీని, పీహెచ్‌సీకి ఉన్న అదనపు భూమిని రెవెన్యూ అధికారులు, పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీతో కలసి ఎమ్మెల్యే పరిశీలించారు. పీహెచ్‌సీకి గతంలో దాతలైన మంగెన కుటుంబాలు 2.59 ఎకరాల భూమి విరాళంగా ఇచ్చారని ఎమ్మెల్యేకు స్థానికులు తెలిపారు. ఇక్కడ సరైన వైద్య సౌకర్యాలు లేక అధునాతన వైద్య సౌకర్యాలకు వేర్వేరు పట్టణాలకు తప్పని పరిస్థితుల్లో రోగులు అవస్థలు పడి వెళుతున్నారని అన్నారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాజోలు సీహెచ్‌సీ అభివృద్ధికి నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ వారు సహకరించడానికి ముందుకు వచ్చారని, అదే విధానంలో లక్కవరం పీహెచ్‌సీ ఆవరణలో కూడా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని నిర్మించడానికి ప్రణాళిక రూపొందిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, సర్పంచ్ కోట పుష్పకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

రాజోలు: తెలుగు భాషా దినోత్సవాన్ని బుధవారం రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. గిడుగు వేంకట రామమూర్తి జయంతి పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సాయిబాబు అధ్యక్షత జరిగిన సమావేశంలో నూజివీడు ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జడా సుబ్బారావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మాతృభాష గొప్పతనాన్ని, విశిష్టతను గిడుగు రామ్మూర్తి పంతులు చాటి చెప్పారన్నారు.

దివ్యాంగుల పింఛన్ల తనిఖీ



పెదపళ్లలో దివ్యాంగుడి అంగవైకల్యం వివరాలు నమోదు చేసుకుంటున్న అధికారులు

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలో చేపట్టిన దివ్యాంగుల అంగవైకల్యం తనిఖీ బుధవారం పూర్తయింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు ప్రత్యేక వైద్య నిపుణులు, పి.గన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వి.రాఘవేంద్రరావు పర్యటించి వివిధ గ్రామాల్లో ఉన్న పూర్తి అంగవైకల్యం ఉన్న 49 కేసులు పరిశీలించారు. మంచం పట్టిన రోగుల ఇంటికి వెళ్లి అంగవైకల్యం నిర్ధారణ చేసుకున్నారు. పూర్తి అంగవైకల్యం ఉన్న దివ్యాంగులను గుర్తించి రూపొందించిన నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు నివేదించ నున్నట్లు ఆయన తెలిపారు. వైద్యాధికారులు పి.భవానీ శంకర్, డి.సువర్చలాదేవి, ఆర్.మల్లికార్జున్, డి.సాయి కిషోర్ పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్‌కు సన్మానం



సాయికుమార్‌ను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆదిత్యకుమార్

మామిడికుదురు: నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా స్థాయిలో 416వ ర్యాంకు సాధించిన రాజోలు మండలం ములికిపల్లికి చెందిన కొడవటి సాయికుమార్‌ను మామిడికుదురులో బుధవారం ఘనంగా సన్మానించారు. మామిడికుదురుకు చెందిన వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కటకంశెట్టి ఆదిత్యకుమార్‌తో పాటు పలువురు స్థానికులు సాయికుమార్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అభిలషించారు. కార్యక్రమంలో రాజోలు మాజీ పీఏసీఎస్ మాజీ చైర్మన్ కూనపరెడ్డి రాంబాబు, అడబాల బుజ్జి పాల్గొన్నారు.

ప్రత్యేక పారిశుధ్య పనులు

మామిడికుదురు: అప్పనపల్లిలో దోమల బెడద తీవ్రంగా ఉంది. గోదావరి వరద అనంతరం దోమల విపరీతంగా పెరిగిపోయాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల ప్రభావంతో వైరల్ జ్వరాల సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో దోమల నిర్మూలనకు గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ప్రతి ఇంటి వద్ద బ్లీచింగ్ చల్లించి, మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. దోమల నిర్మూలనకు ఎబేట్ మందు ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నారు. సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, గెద్దం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో హెల్త్ అసిస్టెంట్ యజ్ఞేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ నిఖిత, ఆశ కార్యకర్తలు, పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్నారు.

వరి పొలాల పరిశీలన

రాజోలు: వరి పొలాలను మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. బుధవారం తాటిపాకలో క్షేత్రస్థాయిలో వరి పొలాలను సందర్శించి వరిని ఆశించే తెగుళ్లు, పురుగుల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా వరిపొలాల్లో ఎక్కువగా కాండం తొలిచే పురుగు వ్యాప్తి చెందుతున్నట్టు శాస్త్రవేత్తలు గుర్తించారు. కాండం తొలిచే పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 20ఈసీ 2.5 మిల్లీలీటర్లు, ఆకు నల్లి నివారణకు ప్రొఫెనోఫాస్ 50ఈసీ 2 మిల్లీ లీటర్లు మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని వివరించారు. కీటక శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త పి.రాధిక, వ్యవసాయ యాంత్రీకరణ శాస్త్రవేత్త అప్పారావు, డాట్ సెంటర్ కోఆర్డినేటర్ నందకిశోర్, డీఆర్సీ పీడీ కిరణ్మయి, ఏడీఏ రాజశేఖర్, ఏఓ మనోహర్, మధుకుమార్ పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

సఖినేటిపల్లి: రాజోలు నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతున్న ఇరువురికి వైఎస్సార్ సీపీ ఇతార్ కన్వీనర్, రామేశ్వరానికి చెందిన దొండపాటి శశికిరణ్ మొత్తం రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు వారికి శశికిరణ్ తల్లి, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, ఎంపీపీ వీరా మల్లిబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఇందులో సఖినేటిపల్లి మండలంకు చెందిన మత్తి ఇవాంకకు రూ.10 వేలు, రాజోలు మండలం పొన్నమండకు చెందిన బత్తుల లాస్విక్‌కు రూ.10 వేలు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు శశికిరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్ పరిశీలన

సఖినేటిపల్లి: పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌ను బుధవారం అమలాపురం ఆర్డీవో కేశవవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. హార్బర్‌లో అభివృద్ధి పనుల నిమిత్తం ఈ పరిశీలన చేసినట్టు సమాచారం. ఈ మేరకు హార్బర్ విస్తరించి ఉన్న ఏరియాను ఆర్డీవోకు రెవెన్యూ అధికారులు, సర్వేయర్ వివరించారు. తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ భాస్కర్, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.